క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి లక్ష విరాళం



దాతకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల కోసం గురువారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ వాస్తవ్యులైన వెంకటేశ్వర్లు దంపతులు రూ.1,00,116 నగదు రూపంలో ఆలయ అభివృద్ధి కోసం విరాళంను అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు.

దర్గాలో ఫాతెహాలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొన్నాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

రేపు చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెలపూజ

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెల పూజ శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నెల పూజ సందర్భంగా సాయంత్రం 7 గంటలకు స్వామి వారికి నైవేద్యం తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల పూజ ఉత్సవాలకు వివిధ గ్రామాల, పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సీజేఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఆదోని రూరల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కర్నూలు జిల్లా ఎంఎస్పీ అధికార ప్రతినిధి బండారి హనుమంతు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు బాలన్న, వీరేష్, ఆదోని నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ బండారి గిడ్డయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఈనెల 22న చలో హైదరాబాద్, 23న చలో అమరావతి, 24న చలో చెన్నై, 25న చలో బెంగళూరుకు తరలివెళ్లి నిరసన తెలియజేస్తామన్నారు. దళిత జాతికి చెందిన ప్రధాన న్యాయమూర్తిపై దాడి బాధాకరమన్నారు. ఇకపై ఇలాంటి దాడులు జరగకుండా కఠిన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండారి గిడ్డయ్య ఆదిగ, గుమ్మల బాలస్వామి, బైచిగేరి తిమ్మన్న, జీఎస్ దత్తు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పర్యటనను విజయవంతం చేద్దాం

ఆదోని రూరల్: ఈనెల 12న మందకృష్ణ నంద్యాల పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ 8వ వార్డు అరుణ్‌జ్యోతి నగర్ ఇన్‌చార్జ్ మైత్రి కాంతరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్ల నుంచి అలుపెరగని పోరాటం చేసిన యోధుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఎంఎస్పీ జిల్లా నాయకులు సాంబగల్ బాలన్న, కల్లుబావి పీఎస్ వీరేష్, హనుమంతు, ఆదోని మండల కో కన్వీనర్ ఇన్‌చార్జ్ బండారి గిడ్డయ్య, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని ఈనెల 15వ తేదీన జరిగే పీడీఎస్‌ఓ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర నాయకులు తిరుమలేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో విద్యార్థుల పరిస్థితి రోజురోజుకు దిగజారుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణిలో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేట్ విధానాలతో సమస్యలు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో ఆదోని డివిజన్ సెక్రటరీ శివ, పట్టణ కార్యదర్శి రాజేష్, కళాశాల కమిటీ సెక్రటరీ స్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు ఆయనకు అలవాటు



వెంకటాపురం కాలనీలో విస్తృత సమావేశానికి హాజరైన పాల్గొన్న ప్రజలు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు

- సూపర్ సిక్స్ పథకాలతో మోసం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ బుట్టా రేణుక
- వెంకటాపురం కాలనీ, మాచాపురంలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'



మాచాపురంలో చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ప్రజలకు మభ్యపెట్టేందుకు ఇచ్చే హామీలను గెలిచిన తరువాత విస్మరించి ప్రజలను వెన్నుపోటు పొడవడం అలవాటయ్యిందని, దీనిని ప్రజలు గుర్తించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. పట్టణంలోని వెంకటాపురం కాలనీలో గురువారం రాత్రి 28వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బోయబజారి, పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు బోయరాజు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు బుట్టా శివనీలకంఠ, మురహరిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, పార్టీ నాయకులతో కలిసి చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఇందులో భాగంగా కాలనీలో ఇంటింటికి వెళ్లి మహిళలకు బాబు మోసాలపై క్యూఆర్ కోడ్ కరపత్రాలిచ్చి వివరించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజలను సూపర్ సిక్స్ పేరిట మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇచ్చిన హామీలను నేటికి పూర్తిగా అమలు చేయక సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగనన్న ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లోని నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపజేసి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి ఆదుకున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ డిష్‌కేశవరెడ్డి, పార్టీ జిల్లా నాయకులు సునీల్‌కుమార్, శివప్రసాద్, పార్టీ పట్టణ నాయకులు బజారిరెడ్డి, కోటకొండ నరసింహులు, విశ్వనాథ్ రమేష్, మహబుబ్‌బేగ్, ముల్లా రసూల్, భాస్కర్‌రెడ్డి, అల్తాఫ్, ల తారెడ్డి, రుద్రాక్షాల బజారి, గురువయ్య, మా బ్బాష, సోమేష్, మధుబాబు, చేనేత మల్లికార్జున, ప్రభాకర్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో మోసం

నందవరం : అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చి, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలను మోసం చేస్తూ చంద్రబాబు పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక విమర్శించారు. గురువారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కోటేశ్వర రావు నేతృత్వంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలు, అబద్ధపు హామీలను ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ..17 నెలల కూటమి పాలనలో ఎన్ని హామీలు నేరవేర్చారో తెలపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే కొత్త పింఛన్లు ఇస్తామని ఇప్పటి వరకు పింఛన్లు మంజూరు చేయలేదని, వికలాంగులకు ఉన్న పింఛన్లు తొలగించారని దుయ్యబట్టారు. మహిళలకు ఏడాదికి 3 ఉచిత సిలిండర్లని కేవలం ఒక సిలిండర్ మాత్రమే అందించారని విమర్శించారు. ఇలా బాబు పాలన మోసాలతోనే సాగుతుందన్నారు.

రాష్ట్రాన్ని అప్పులో ఊబిలోకి నెట్టారు

ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఊబిలో నెట్టారని బుట్టా రేణుక విమర్శించారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించిందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, అధిక వర్షాలకు నష్టపోతే పంట నష్ట పరిహారం కూడా అందిచలేదన్నారు. ఇచ్చిన హామీల్లో కూటమి ప్రభుత్వం కోతలు విధించిందని, అధికారం కోసం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు గాలి మాటలుగానే మిగిలాయన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో కూటమి నేతలు ప్రజలను నట్టేటముంచారని విమర్శించారు. రైతులకు రున మాఫీ, నిరుద్యోగ భృతి, విద్యార్థుల కోసం సరైన సదుపాయాలు కల్పిస్తామని కూటమి మాటలకే సరిపెట్టుకుందని ఎద్దేవ చేశారు. చంద్రబాబు అమరావతి జపం చేస్తూ రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని విస్మరించారన్నారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, మురహరి రెడ్డి, విరుపాక్షిరెడ్డి మాట్లాడుతూ..రైతులు ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. రైతులు చంద్రబాబు పాలనలో తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సినియర్ నాయకులు బుట్టా నీలకంఠ, గ్రామ సర్పంచ్ పల్లదొడ్డి కిష్టప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ కోటేశ్వర రెడ్డి, నరహరిరెడ్డి, రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి సావిత్రమ్మ, గాలేన్న, సత్యన్న, రంగస్వామి, రవి, చాంద్ బాషా, వెంకటేష్, రమేశప్పగౌడ్, ఎల్లా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



వాహనం లోనే కాన్పు అయిన దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామానికి చెందిన జయశ్రీకి గురువారం తెల్లవారు జామున 108 వాహనంలో ప్రసవం అయ్యింది. జయశ్రీకి రాత్రి 2గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు రావడంతో కోసిగి 108 వాహనంకు ఫోన్ చేశారు. బదినేహాల్ నుంచి ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే వాహనంలోనే జయశ్రీ ఆడపాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పార్థసారథి గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.17,76,921 చెక్కులను బాధితులకు అందించామన్నారు.

ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించండి

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు కరుణాకర్, నబి రసూల్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ నాయకులు ఎస్సీ కాలనీలో పర్యటించారు. వారు మాట్లాడుతూ స్థానిక ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక మురుగు నీరు ఇళ్ల ముందే నిల్వ ఉంటున్నాయన్నారు. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఎస్సీ కాలనీలో మురుగు నీటిని పరిశీలించి అక్కడ రోడ్డు వేయాలని సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బతకన్న, మునెప్ప, కాలనీ వాసులు రామక్క, నరసమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు

ఆదోని సెంట్రల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గురువారం మెడికల్ కళాశాల సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, కో కన్వీనర్ దస్తగిరి, సభ్యులు, ఉదయ్, అఖండ, బాలు విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ధనంతో నిర్మించిన కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. 80 శాతం నిర్మాణ పనులు జరిగాయన్నారు. కొంతమేర నిధులు కేటాయించి పనులు చేస్తే కళాశాల పూర్తవుతుందని చెప్పారు. ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు విద్య, వైద్యం అందే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉమాకాంత్, చిరు, రాజు, మహేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వేణుగోపాల్

కౌతాళం: డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజానిన నిర్మించాలని సెట్కూర్ సీఈఓ వేణుగోపాల్ అన్నారు. మత్తు పదార్థాల వ్యసనం, పర్యావసానాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై గురువారం కౌతాళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ఏడాదికి 1.4లక్షల మంది డ్రగ్స్ వల్ల మరిణిస్తున్నారని మన ఎదుర్కొంటున్న కీలక సమస్యల్లో డ్రగ్స్ ఒకటన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డేవిడ్, మాట్లాడుతూ మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. క్రీడలు, హాబీలతో మానసిక ఆనందాన్ని పొందాలని సూచించారు. సమావేశంలో ఏఎస్‌ఐ రమణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మాబుసుభాని ఉరుసు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో రంగప్ప గట్టు వద్ద మాబు సుభాని ఉరుసు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం దర్గాకు ప్రత్యేక అలంకరణలు గావించి నిర్వాహకులు గౌస్ పీరా ఆధ్వర్యంలో ప్రత్యేక ఫతేహాలు సమర్పించారు. కుల మతాలకు అతీతంగా హిందు, ముస్లీం సోదరులు దర్గాను దర్శించుకున్నారు. భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బాలిక అదృశ్యం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని పరమాన్‌దొడ్డి తండాకు చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. గురువారం పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. పరమాన్‌దొడ్డి తండాలో ఓ హోటల్ నిర్వాహకుడి కుమార్తె ఈ నెల 6వ తేదీ (సోమవారం) అవ్వతాతను చూసేందుకు ఉరుకుంద గ్రామానికి వెళ్లొస్తానని ఇంట్లో నుంచి బయలుదేరింది. తిరిగి రాకపోవడంతో బంధువులకు ఫోన్ చేసి విచారించినా ఆచూకి తెలియకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. మార్కాపురంలో పాలిటెక్నిక్ చదువుతున్న బాలిక దసరా సెలవులు కావడంతో ఇంటికి వచ్చింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మాధవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

గోనెగండ్ల : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీఓ మణి మంజరి, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠలు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అండర్ 14-17 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ, ఎంఈఓలు హాజరై పోటీలను ప్రారంభించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మంత్రాలయం రూరల్ : ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రం మంత్రాలయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శివాంజల్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోడా బండ్ల నిర్వహకులు, ఆటో డ్రైవర్లతో ట్రాఫిక్ నింబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాలో వాహనాలను నిలపాలని, సోడా బండ్లను ఎక్కడబడితే అక్కడ ఉంచకుండా ఖాళీ స్థలాల్లో ఉంచుకోవాలన్నారు.

పోరాటాలకు సిద్ధం కండి

కౌతాళం: గ్రామసేవకులు పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. గ్రామ సేవకుల మండల కమిటీ జనరల్‌బాడీ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామసేవకులు ప్రభుత్వానికి వెట్టిగా పనిచేస్తున్నారని, గతంలోనే తెలుగుదేశం ప్రభుత్వం జీతాలు పెంచుతామని చెప్పి ఐదు సంవత్సరాలు కాలయాపన చేసిందన్నారు. మళ్లీ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చి ఒకటిన్నర సంవత్సరమైనా గ్రామ సేవకులు ఎన్నిసార్లు ఆందోళన చేసినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈనెల 13నుంచి మూడు రోజుల పాటు విజయవాడలో దీక్షలు, ర్యాలీ, బహిరంగసభ జరుగుతుందన్నారు. దీక్షల్లో గ్రామ సేవకులందరు పాల్గొని కూటమి ప్రభుత్వానికి గ్రామసేవకులు సత్తా ఏమిటో చూపించాలన్నారు. సమావేశంలో గ్రామ సేవకులు నాగరాజు, తాయప్ప, మారెప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి అంతం మన పంతం



ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయవ్యాధి అంతం మన పంతం అని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌బాను అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్ హెల్త్ సెంటర్ పరిధిలోని శివశంకర్ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఆయాసం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం తదితర లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుబ్బమ్మబాయి, ఏఎన్ఎం శంకరమ్మ, ఆశావర్కర్లు హారిక, సుజాత, సౌభాగ్య, సరోజ తదితరులు పాల్గొన్నారు.

11న గోనెగండ్లలో భజన పోటీలు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెల పూజ సందర్భంగా భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పూజారులు గురువారం తెలిపారు. 11వ తేదీ రాత్రి 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీలలో పాల్గొను బృందాల వారు అదే రోజు రాత్రి 8 గంటల లోపు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి దేవాలయంలో బృందం పేరు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు వరుసగా 30 తులాల వెండి, 20 , 15, 10, 8, 5.1/2, 5.1/4, 5, 3, 2.1/2 తులాల వెండి బహుమతిగా అందజేస్తానారు. వివరాలకు 99120 50356, 98856 37504 నంబర్లను సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

నందవరం : రైతులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని శక్తి టీమ్ సభ్యులు ఏఎస్‌ఐ నటరాజ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ముగతి గ్రామంలోని పత్తి మిల్లులో రైతులకు సైబర్ నేరాలు, మహిళలు, బాలికలు రక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, శక్తి టీమ్ విధులు, నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు అకౌంట్లలో ఉన్న డబ్బు మిస్ కావటంపై ఎలా జాగ్రత్త వహించాలలో వివరించారు. కార్యక్రమంలో శక్తి టీమ్ సభ్యులు కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశనిర్మాణంలో యువత పాత్ర కీలకం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇర్ఫాన్

ఎమ్మిగనూరుటౌన్: దేశనిర్మాణంలో యువత పాత్ర కీలకమని స్థానిక రావూస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇర్ఫాన్ అన్నారు. మైభారత్ మేరా యువభారత్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం స్థానిక రావూస్ డిగ్రీ కళాశాలలో క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ నాగేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ధనుంజయ, గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సీఐ సైదులు

ఆదోని రూరల్: ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌతాళం మండలం బుడుములదొడ్డి క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా 12 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కె.జె.సైదుల్ గురువారం తెలిపారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన కౌతాళం ముక్కయ్య, చిరుతపల్లి గ్రామానికి చెందిన తలారి వీరేష్ మోటార్ సైకిల్‌పై అక్రమంగా 12 బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. 90 ఎం.ఎల్ పరిమాణం గల 1152 కర్ణాటక మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి జైలుకు తరలిస్తున్నట్లు తెలిపారు.

ముత్తాత స్ఫూర్తి.. ప్రజాసేవ చేయాలనే సంకల్పం



నియామక పత్రంతో వంశీకృష్ణారెడ్డి, తల్లిదండ్రులు

పెద్దకడబూరు : ముత్తాత స్ఫూర్తితో ప్రజలకు సేవ చేయాలనే కాంక్షతోనే విజయం సాధించగలిగానని తెలంగాణలో డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికైన అయ్యప్పగారి వంశీకృష్ణారెడ్డి తెలిపారు. పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన అయ్యప్పగారి వంశీకృష్ణారెడ్డి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ - 1 పరీక్షలలో రాష్ట్రంలో 3వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపిక అయ్యారు. మండల కేంద్రానికి చెందిన అయ్యప్పగారి వెంకటరెడ్డి, పద్మజల కుమారుడు ఏ.వంశీకృష్ణారెడ్డి ఆయన ముత్తాత అయిన స్వాతంత్ర్య సమరయోధుడు ఏ.వెంకటరెడ్డి గారి దేశభక్తి, జాతీయాభిమానాన్ని స్ఫూర్తిగా తీసుకొని చిన్ననాటి నుంచి అన్ని పరీక్షలలో మొదటి ర్యాంక్‌లు సాధిస్తూ, అన్నింటిలో చురుకుగా పాల్గొనేవాడు. ఐఏఎస్ లక్ష్య సాధనలో భాగంగా ఎన్ఐటీలో బీటెక్ పూర్తి అయిన తరువాత యూనియన్ పబ్లిక్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతూ మొదటి ప్రయ్యత్నంలోనే ప్రిలిమ్స్ పాసై మెయిన్స్ రాశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలలో ఎంపికై ప్రస్తుతం ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తూ తెలంగాణలో గ్రూప్-1కు ఎంపికయ్యారు. వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ తనకు చిన్ననాటి నుంచి రైతు కుటుంబం నుంచి వచ్చిన మా ముత్తాత వెంకటరెడ్డి అంటే, ఆయన దేశభక్తి అంటే చాలా ఇష్టం అన్నారు. ఆయన కథలు వింటూ పెరిగానని ఆయన స్ఫూర్తితోనే ఈ ర్యాంక్ సాధించడం జరిగిందన్నారు. ఐఏఎస్‌గా సెలెక్ట్ అయ్యి దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యి ప్రజలకు సేవచేస్తూ మా అమ్మనాన్నల పేరుతో పాటు తమ గ్రామం పేరు నిలబెట్టాలన్నదే తన లక్ష్యమన్నారు. ఆయన ఎంపిక పట్ల గ్రామ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

భారీ వర్షానికి కాలనీలు జలమయం



జలమయమైన తిరుమల నగర్‌లోని ఓ రహదారిలో అవస్థలు పడుతున్న మహిళలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో శివారు కాలనీలతో పాటు పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో పలు కాలనీ వాసులు గురువారం ఉదయం ఇంటి నుంచి బయటికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. ఎమ్మిగనూరు మండలంలో బుధవారం రాత్రి 39 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో తిరుమల నగర్ పూర్తిగా జలమయం అయింది. దీంతో ఆ ప్రాంతంలో వుండే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడ్డారు. రహదారులన్నీ మోకాల్లోతుగా నీరు నిలిచిపోవడంతో అధికారుల తీరును వారు దుయ్యబట్టారు. ఆ ప్రాంత వాసులు పిల్లాపాపలతో తరలి వచ్చి స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి ఎమ్మెల్యే వచ్చి చూడాలని, అధికారుల నిర్లక్ష్యంపై పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రధాన రహదారుల్లోని డ్రైనేజీలు, స్థలాలు కబ్జాకు గురికావడంతో వర్షం వచ్చిన ప్రతి సారి తమ ప్రాంత వాసులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తిరుమల నగర్‌కు చెందిన ఆంజినేయులు, నాగరాజు, రాఘవేంద్ర, రాజేశ్వరి, రేణుక, మంజుల తదితరులు ఆరోపించారు. డ్రైన్ కోసం రెండు రోజుల క్రితం గుంత తవ్వి వదిలేశారని దీంతో నీరు మొత్తం నిలిచిపోయిందన్నారు. అధికారులు స్పందించి సమస్యను సత్వరం పరిష్కరించాలని కోరుతున్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కోసిగి: మండలంలోని కందుకూరు, దుద్ది, చిన్న భూంపల్లి, పెద్ద భూంపల్లి గ్రామాల్లో కులవివక్షత పోరాట సమితి (కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం ఆయా గ్రామాల్లో ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి రామకోటి హనుంతు, ప్రకాష్‌ల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. నాయకులు రాముడు, బొజ్జప్ప, జయన్న, వసంత, ముక్రప్ప, నరసప్ప పాల్గొన్నారు.